మెరుగైన ఫలితాలే లక్ష్యం





పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

- ఈ ఏడాది మురళీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటేనా?
- గత ఏడాది కన్నా.. తగ్గిన ఫలితాలు
- ఉపాధ్యాయులకు సవాలుగా మారిన ఫలితాల సాధన

మురళీనగర్: కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ విద్యార్థులు పాఠశాలలకు ఇప్పుడిప్పుడే రావడం మొదలు పెట్టారు. విద్యార్థుల బోధనాభ్యసనకు సంబంధించి అన్ని పాఠశాలల్లోనూ ఏర్పాట్లు పూర్తయ్యాయి. బదిలీలు దాదాపు పూర్తయి, కొత్త ఉపాధ్యాయులు చేరారు. అయితే ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు గత ఏడాది కన్నా తగ్గాయి. ఫలితాలు మెరుగు పరచడం ఉపాధ్యాయుల ముందున్న సవాలుగా మారింది.

నాలుగు పాఠశాలలు..

మురళీనగర్ పరిసరాల్లో మాధవదార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, అల్లూరి సీతారామరాజునగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాల, బర్మా కాలనీ ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. మాధవధార ఉన్నత పాఠశాలలో 776 మంది విద్యార్థులు, ప్రాథమిక పాఠశాలలో 330 మంది, కె.కాలనీ ఉన్నత పాఠశాలలో 486 మంది, బర్మా కాలనీ ప్రాథమిక పాఠశాలలో 256 మంది విద్యార్థులు చదువుతున్నారు. మాధవదార ఉన్నత పాఠశాలలో రీఅపోరేషన్‌లో 21 సెక్షన్లు వచ్చాయి. గతంలో 16 సెక్షన్లు ఉండేవి. 49కి ఒక సెక్షన్ చొప్పున ఏర్పాటు చేయడంతో ఇలా ఏర్పాటు చేశారు. గత ఏడాది మాధవదార ఉన్నత పాఠశాల నుంచి 155 మంది పదవ తరగతి విద్యార్థులు వెళ్లిపోయారు. పక్కన ఉన్న ప్రాథమిక పాఠశాల నుంచి చేరిన 105 మందితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఈ లోటు భర్తీ అయిందని హెచ్‌ఎం బి.హేమలత చెప్పారు. ప్రైవేటు పాఠశాలల నుంచి కూడా ఇక్కడ విద్యార్థులు చేరుతున్నారని ఆమె చెప్పారు.

పెరిగిన పోస్టులు..

మాధవదార, కె.కాలనీ ఉన్నత పాఠశాలలో రీ అపోర్షన్ అంటే సెక్షన్‌కు 49 మంది విద్యార్థులుగా లెక్కించినందున కొన్ని పోస్టులు పెరిగాయి. మాధవదారలో 15 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా 20 మంది ఉపాధ్యాయులు వచ్చారు. ఫిజికల్ టీచర్ పోస్టులో ఒకటి సర్‌ప్లస్ పోగా 3 పోస్టులు ఉన్నాయి. గణితంలో రీఅపోర్షమెంట్‌లో రెండు అదనపు పోస్టులు వచ్చి 5 పోస్టులయ్యాయి. బయలాజికల్ సైన్సులో ఒక 8 ఇయర్స్ వేకెన్సీ, రెండు రిటైర్‌మెంటు వేకెన్సీ పోస్టులు భర్తీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ 3 సోషల్ పోస్టులు ఉండగా రీఅపార్ష్‌మెంటులో ఒకటి అదనంగా వచ్చింది. దీంతో సోషల్ 4 పోస్టులకు పెరిగింది. ఇంగ్లీషు సబ్జెక్టుకు సంబంధించి 4 పోస్టుల్లో ఒకటి హైస్కూల్ ప్లస్‌కు డిప్లాయిమెంటులో వెళ్లినందున ఖాళీ స్థానంలో కొత్తవారితో భర్తీ చేశారు. తెలుగు-1, మ్యాథ్స్-2, సోషల్-1, పీడీ రెండు పెరిగాయి. కె.కాలనీ ఉన్నత పాఠశాలలో రీ అపోర్షన్ ద్వారా తెలుగు, సోషల్, పీడీ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున పెరిగాయి. పెరిగిన పోస్టులతో కలిపి తెలుగు 3, హిందీ 2, ఇంగ్లీషు 3, గణితం 3, ఫిజికల్ సైన్సు 2, ఎన్ఎస్ 2, సోషల్ 3 పోస్టుల్లో పని చేస్తున్నారు. పీడీ పోస్టులు రెండు ఉన్నాయి. ఒకరు ఇంకా చేరాల్సి ఉందని హెచ్‌ఎం ఎస్ఎస్‌ఎం సాయిలక్ష్మి చెప్పారు. వొకేషనల్ టీచర్ కూడా పని చేస్తున్నారు.

తగ్గిన ఫలితాలు..

కె.కాలనీ ఉన్నత పాఠశాలలో గత ఏడాది (మార్చి 2024)లో పదో తరగతి 109 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 91 మంది పాసై 87 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది అంటే 2025 మార్చిలో 99 మంది వెళ్లగా 81 మంది పాసై 82 శాతం ఫలితాలు సాధించారు. ఈపాఠశాలలో గత ఏడాది 486 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం నూతనంగా చేరిన వారితో కలిపి 450 మంది ఉన్నారు. మాధవదార ఉన్నత పాఠశాలలో 2024లో 154 మంది టెన్త్ పరీక్షలు రాయగా 135 మంది ఉత్తీర్ణత సాధించి 87 శాతం ఫలితాలు సాధించారు. ఈ ఏడాది మార్చిలో 155 మంది పరీక్షలు రాయగా 112 మంది ఉత్తీర్ణులై 73 శాతం ఫలితాలు సాధించారు. అంటే 14 శాతం ఫలితాలు తగ్గాయి. ఈ పాఠశాలలో గత ఏడాది 776 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 741 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఫలితాల లోటును భర్తీ చేయాల్సి ఉంటుంది.

|| కనీస సామర్థ్యాలపై దృష్టి.. ||

ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) అమలుకు విద్యా శాఖ ఇప్పటికే సిలబస్ రూపొందించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాల సాధనపై దృష్టి సారించాల్సి ఉంది. ఆగస్టు వరకు ఈ పనిపై పూర్తి స్థాయిలో పని చేయాల్సి ఉంటుంది. హైస్కూళ్లలో 6 నుంచి 10వ తరగతి వరకు లెర్నింగ్ ఔట్‌కమ్స్ ప్రతి సబ్జెక్టుకు సాధించాల్సి ఉంది. వెనుకబడిన విద్యార్థులతో ప్రత్యేకంగా సాధన చేయించాల్సి ఉంది. లీప్ యాప్‌లో ప్రతి ఉపాధ్యాయుడు తాను పాఠాలు చెబుతున్న తరగతుల్లో విద్యార్థుల గ్రేడ్‌లు నమోదు చేసి వారు సాధించిన ఫలితాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు..

మాధవదార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, బర్మా కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మార్చారు. వీటికి పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరయ్యాయి. మాధవదార పాఠశాలకు ఇప్పటికే పని చేస్తున్న ఎస్.పెద్దినాయుడు పీఎస్ హెచ్‌ఎంగా కొనసాగుతారు. ఇక్కడ పని చేస్తున్న కె.వసంత కుమారి పదోన్నతిపై పీఎస్ హెచ్‌ఎంగా బర్మా కాలనీ పాఠశాలకు నియమితులయ్యారు. మాధవదార ప్రాథమిక పాఠశాలలో 330 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో హెచ్‌ఎం పోస్టుతో కలిపి 12 మంది టీచర్లు పని చేస్తున్నారు. వీరిలో 8 మంది పదోన్నతులపై వెళ్లిపోయారు. కె.వసంత కుమారి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా బర్మా కాలనీ పాఠశాలకు వెళ్లారు. ఒకరు 8 ఏళ్లు పూర్తి అయినందున బదిలీపై వెళ్లారు. అంటే మొత్తం 9 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని హెచ్‌ఎం ఎస్. పెద్దినాయుడు చెప్పారు. సోమవారం నాటికి భర్తీ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. బర్మా కాలనీ ప్రాథమిక పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ పని చేసిన హెచ్‌ఎం బదిలీపై మల్కాపురం పాఠశాలకు వెళ్లారు. విద్యార్థులకు ఎస్ఆర్‌కే కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని హెచ్‌ఎంలు తెలిపారు.



నూతనంగా చేరిన విద్యార్థులతో హెచ్‌ఎం పెద్దినాయుడు



మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం హేమలత (ఫైల్)

క్లుప్తంగా

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు సరుకులు అందిస్తున్న జగదీశ్వరరావు

సీతంపేట: అక్కయ్యపాలెం శబరి కుటీర్ బృందావనంలోని కోన కుంచయ్య చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో మేనేజింగ్ ట్రస్టీ కోన జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తన తల్లి కోన మహాలక్ష్మి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 150 మంది పేదలకు బియ్యం, పప్పు, నూనె వంటి సరుకులు అందించారు. నిరుపేద విద్యార్థులకు విద్యావికాస్ పేరిట స్కూల్ ఫీజులు చెల్లించి, పుస్తకాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు అప్పలరాజు, మురళీకృష్ణ, కృష్ణ కల్యాణి, యోజన రాణి, కృష్ణకుమారి, లక్ష్మి సత్యవతి, కుశాల్, కుసుమేష్, రవికుమార్ పాల్గొన్నారు.

చేనేతకు ప్రోత్సాహం



చేనేత వస్త్ర ప్రదర్శనను సందర్శించిన మంజులారెడ్డి

మురళీనగర్: మాధవదార వుడా కాలనీ సామాజిక భవనంలో నిర్వహిస్తున్న చేనేత, హస్తకళల ప్రదర్శనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిల్పారామాల చైర్‌పర్సన్ సీహెచ్ మంజులారెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, హస్త కళాకారులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను ఆమె పరిశీలించారు. చేనేత, హస్త కళాకారులను తమ సంస్థ ప్రోత్సహిస్తుందని ఆమె చెప్పారు.

గురుశిష్యుల బంధం గొప్పది



ప్రసంగిస్తున్న రచయిత సూర్యారావు

సీతంపేట: భారతీయ సంస్కృతిలో గురువుకు గల స్థానం మహోత్కృష్టమైనదని, మట్టిముద్ద లాంటి వ్యక్తిని మహాశిల్పంగా తీర్చిదిద్దేవాడు గురువని రచయిత, సాహితీ విమర్శకుడు డాక్టర్ డి.వి.సూర్యారావు అన్నారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో ఆదివారం గురుశిష్య సంబంధంపై ఆయన ప్రసంగించారు. గురువు కేవలం తరగతి గదిలో పాఠాలు చెప్పే వాడు మాత్రమే కాదని, తన శిష్యులను కన్నబిడ్డల్లా పోషిస్తూ వారిలోని అజ్ఞానాన్ని తొలగించి వివేకవంతులుగా రూపొందించి బయటి ప్రపంచంలోకి పంపిస్తాడని తెలిపారు. ఉపనిషత్తులు, రామాయణ, మహాభారత కావ్యాల ఆధారంగా సద్గురు లక్షణాలు, ఉత్తమ శిష్యుల గుణగణాలు వివరిస్తూ, ఆదిశంకరులు జగద్గురువని వివరించారు. కార్యక్రమానికి ఆచార్య కోలవెన్ను మలయవాసిని అధ్యక్షత వహించారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన సంగీత విభావరి



మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన మెగా సినీ సంగీత విభావరి ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. మెగాస్టార్ చిరంజీవితోపాటు పలు సినీ హీరోలకు సంబంధించిన పాటలు పాడి గాయనీ గాయకులు మెప్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కందుల నాగరాజు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కళాకారులకు కొదువలేదన్నారు. ఎంతో మంది గాయనీ గాయకులు పలు వేదికలపై ప్రతిభ పాటవాలు ప్రదర్శిస్తూ మెప్పిస్తున్నారన్నారు. చిరంజీవి కళాపరిషత్ అధ్యక్షుడు గెంబలి జగదీష్ క్రమం తప్పకుండా సంస్థ వార్షికోత్సవంతోపాటు సంగీవ విభావరి నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు గంటి మురళీధర్, చెన్నా తిరుమలరావు, బి.వి.రామ్, రవితేజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హాస్యంలో జంధ్యాలది ప్రత్యేక ఒరవడి



మాట్లాడుతున్న జంధ్యాల ఆప్తమిత్రుడు, నటుడు డాక్టర్ ఎం.సి.దాస్



డాక్టర్ దాస్‌ను సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, రఘురామారావు తదితరులు

సీతంపేట: జంధ్యాల సినిమాల్లో హాస్యం లోక విదితమని, ఆయన హాస్యం గురించి పరిచయం అక్కర్లేదని జంధ్యాల ఆప్తమిత్రుడు, ప్రముఖ నటుడు డాక్టర్ ఎం.సి.దాస్ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన 'హాస్యానికి భాష్యం చెప్పిన జంధ్యాల' అనే అంశంపై ఆయన ప్రధాన వక్తగా ప్రసంగిస్తూ జంధ్యాలతో తనకున్న తీపి జ్ఞాపకాలు, హాస్య సంభాషణలు, సినిమాలోని సంఘటనలు సభకు వివరించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం జంధ్యాల నుంచి ఫోన్ వచ్చేదని, ఒక్కోసారి రాత్రిళ్లు గంటల తరబడి మాట్లాడుకునే వారమని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో జంధ్యాల ఎస్.ఆర్. కళాశాలకు నల్ల అంబాసిడర్‌లో వెళ్లేవారని, జంధ్యాల ఎక్కడ ఉన్నా అక్కడ స్నేహితులు గుంపులుగా ఉండేవారన్నారు, కాలేజీ రోజుల నుంచే నాటకాలు రాసేవారని, ఆయన రాసిన నాటకాలకు తాను దర్శకత్వం వహించేవాడినని తెలిపారు. జంధ్యాల పూర్తి పేరు జంధ్యాల వీర వెంకట శివ శుబ్రహ్మణ్యశాస్త్రి అని, ఏరాశాస్త్రి అని పిలిచేంత చనువు తనకు ఉండటం అదృష్టమన్నారు. నరసాపురంలో 1951లో జన్మించిన జంధ్యాల 1974లో సినీరంగప్రవేశం చేశారన్నారు. స్నేహం అనేది జంధ్యాల సంపదగా భావించేవారని, తన సినిమాల్లో స్నేహితులతో జరిగిన సంభాషణలు వాడేవారని గుర్తు చేశారు. జనవరి 14 జంధ్యాల జయంతి, జూన్ 19 వర్ధంతిని ఆయన వీరాభిమానులు, తెలుగు రాష్ట్రాల ప్రజలు జరుపుతున్నారని తెలిపారు. మండలాధీశుడు చిత్రంతో కోట శ్రీనివాసరావుకు సినిమా ఛాన్సులు తగ్గిపోతే అహనా పెళ్లంట చిత్రంతో మరల పునర్జన్మ ఇచ్చారని గుర్తు చేశారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ జంధ్యాల హాస్యం గురించి మననం చేసుకునే అవకాశం విశాఖ రసజ్ఞ వేదిక కల్పించడం అదృష్టమని తెలిపారు. జంధ్యాల హాస్యం ఎంతో ఆహ్లాదంగా ఉంటుందన్నారు. అనంతరం ప్రధాన వక్త ఎం.సి.దాస్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఆచార్యులు పిళ్లా రమణమూర్తి సన్మానపత్రాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, ఎల్లాప్రగడ శ్రీనివాసకుమార్, పలువురు సాహితీవేత్తలు, జంధ్యాల అభిమానులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం



మురళీనగర్ వాకర్స్ పార్కు వద్ద పేరుకుపోయిన చెత్త



ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు రహదారి పక్కన వదిలేసిన చెట్ల కొమ్మలు



ఎన్‌జీజీవోస్ కాలనీ రహదారి వద్ద వదిలేసిన చెట్ల కొమ్మలు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని రహదారుల పక్కన వ్యర్థాలు పడి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. 49, 50 వార్డుల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా శానిటరీ సిబ్బంది వీటిని తొలగించకపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ఉత్తర దిశ రహదారిలో గోడను ఆనుకుని చెత్త పేరుకుపోయింది. ఇది దుర్వాసన వెదజల్లడంతో సందర్శకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడికి రాగానే ముక్కు మూసుకోవాల్సిందేనని వాపోతున్నారు. పట్టాభిరెడ్డితోట నుంచి ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం, సెక్టార్-3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు వద్ద రహదారిపై చెట్ల కొమ్మలు పేరుకుపోయాయి. వాటిని సకాలంలో తొలగించడంలో ఏపీఈపీడీసీఎల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వీరు నిర్వహణ పేరుతో చెట్ల కొమ్మలను తొలగించడం, వాటిని రోజుల తరబడి వదిలేయడం పరిపాటిగా మారింది. ఈ సమస్యపై అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

త్వరలో వెలమ గర్జన సభ

ఏయూక్యాంపస్: వెలమ సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయంపై గళమెత్తుతూ త్వరలో విశాఖ వేదికగా వెలమ గర్జన సభ నిర్వహిస్తామని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు తెలిపారు. బీచ్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షలకు పైగా ఉన్న వ్యవసాయ ఆధారిత వెలమ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయాన్ని సభలో వివరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, జిల్లా ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి బర్ల పైడంనాయుడు, ప్రధాన కార్యదర్శి గంగు మన్మధరావు, వరుదు రాజ్‌కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిరోధిద్దాం



సైక్లోథాన్‌లో పాల్గొన్న సైక్లిస్టులు

మురళీనగర్: మాదక ద్రవ్యాలను నిరోధిద్దాం అంటూ సైక్లిస్టులు పిలుపునిచ్చారు. నశా ముక్త్ భారత్ పఖ్వాడా జ్ఞాపకార్థ ఎన్‌సీబీ, ఈగిల్ సంస్థలు సంయుక్తంగా చేపట్టిన సైక్లోథాన్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మత్తుకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆదివారం సైక్లోథాన్‌ను విజయవంతంగా నిర్వహించారు. జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సైక్లోథాన్‌ను పంకజ్ కుమార్ ద్వివేది జెండా ఊపి ప్రారంభించారు. విశాఖపట్నం సూపరింటెండెంట్ రాజన్‌కుమార్, ఈగిల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.రమేష్, కల్యాణి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. సైక్లింగ్‌లో వంద మంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు తమ నడివడికను మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు ఎటువంటి గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకుండా మంచిగా నడుచుకోవాలన్నారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వ పాలన మోసపూరితం



'జగన్ అంటే నమ్మకం..' పోస్టర్ ఆవిష్కరిస్తున్న అల్లు శంకరరావు, 49వ వార్డు పార్టీ శ్రేణులు

మురళీనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు విమర్శించారు. వార్డులోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో అల్లు శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ వార్డు అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారితో కలిసి 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలపై ఆర్థిక భారాలు మోపడమే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలు పెంచి, విద్యుత్ చార్జీల మోత మోగించి పేదల జీవితాన్ని అగమ్యగోచరంగా మార్చిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పాలన సాగించిన ఐదేళ్లు సంక్షేమ పథకాలను నూరు శాతం అమలు చేసి అన్ని వర్గాలకు అందించామన్నారు. సోమవారం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమంలో 49వ వార్డు నుంచి యువతీ యువకులు భారీ సంఖ్యలో తరలిరావాలని శంకరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు అయినింటి రవికుమార్, విశాఖ జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి, విశాఖ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రొంగలి చంద్రమౌళి, స్టూడెంట్ వింగ్ కమిటీ ఎక్జిక్యూటివ్ మెంబర్ పల్లా చైతన్య, వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల చెస్ టైటిల్ హేమిషా కైవసం




హేమిషా, కుమారి మధ్య ఆసక్తికరంగా సాగుతున్నచెస్ పోరు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా మహిళల చదరంగం చాంపియన్‌షిప్‌ను ఎస్.హేమిషా కై వసం చేసుకుంది. జి.కుమారి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం శ్రీ కశ్యప్ జూనియర్ కళాశాలలో ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొత్తం 63 మంది మహిళా చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు ఫిడే ర్యాంకింగ్ సాధించిన వారు ఉండటం విశేషం. టోర్నీలో రెండో ర్యాంక్‌తో (1656 ఫిడే రేటింగ్) బరిలోకి దిగిన జి.కుమారి, చివరిదైన ఆరో రౌండ్‌లో మూడో ర్యాంక్‌తో ఆడిన ఎన్. హేమిషా (1490 రేటింగ్)తో డ్రాగా ముగించింది. పాయింట్లలో సమానంగా నిలిచినప్పటికీ, టైబ్రేకర్స్‌లో కుమారి వెనుకబడటంతో హేమిషా విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో టి.బంధవిక, డి.దివ్య (1463), హెచ్ఎస్ బుష్రా ఐదు పాయింట్లు సాధించినప్పటికీ, టైబ్రేకర్లలో వెనుకబడి జిల్లా జట్టుకు ఎంపిక కాలేకపోయారు. ఎరీనా కాండిడేట్ మాస్టర్ ఎం.మనస్వి(1489)తో పాటు ప్రవల్లిక, ఆశ్రిత, లలిత్యా నాలుగున్నరేసి పాయింట్లతో టోర్నీని ముగించారు. ఆసక్తికరంగా ఫిడే రేటర్ మనస్వికి జిల్లా జట్టులో స్థానం దక్కలేదు. మరోవైపు ఆరీనా ఫిడే మాస్టర్ ఎస్.గౌర్లి పోటీలకు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ చాంపియన్‌షిప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న ఏపీ అంతర్ జిల్లాల మహిళల చాంపియన్‌షిప్‌కు అర్హత లభించింది.

స్టాపర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కొమ్మాది: కంచరపాలెం అరుంధతినగర్‌కు చెందిన జి.ఈశ్వరరావు (34) ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య జి.అనిత నగరంలోని బంగారు నగల విక్రయ దుకాణంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం ఉద్యోగరీత్యా ఈశ్వరరావు భీమిలి వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా యోగాంధ్ర కోసం రామానాయుడు స్టూడియో సమీపంలో ఏర్పాటు చేసిన స్టాపర్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో అతను రోడ్డుపై దూరంగా ఎగిరిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఈశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

'యువత పోరు'కు పెన్షనర్స్ అసోసియేషన్ మద్దతు



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మార్కండేయులు, అసోసియేషన్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి విశాఖ జిల్లా ఎంప్లాయీస్, పెన్షనర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. ఈ నెల 23న వైఎస్సార్‌సీపీ యువత పోరు పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం ఎంవీపీ కాలనీలో అసోసియేషన్ ప్రతినిధులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువతను దారుణంగా మోసం చేసిందన్నారు. ఏడాది పాలనలో యువతకు చేసిందేమి లేదని దుయ్యబట్టారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై యువతకు అపారమైన నమ్మకం ఉందన్నారు. దాదాపు 3 లక్షల ఉద్యోగాలు కల్పించడం ద్వారా యువతకు ఆయన బంగారు భవిష్యత్ కల్పించారని చెప్పారు. కూటమి మోసాలను ఎండగడుతూ యువత పోరుకు అండగా నిలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పైడిరాజు రెడ్డి, ఎం.లోకనాథం, యు.అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.